# సాక్షి బాపట్ల

బుధవారం, 17, జూలై, 2024




## ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవం

వెల్దుర్తి: గుండ్లపాడులో వేంచేసియున్న ఎల్లమ్మ తల్లికి మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో బోనాలు సమర్పించటం ఆనవాయితీ



## అమ్మవారికి ఆషాఢ సారె

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి మహిళలు మంగళవారం ఆషాఢ సారె సమర్పించారు.



## నేడు ఏకలవ్య జయంతి

చిలకలూరిపేట: పట్టణంలో బుధవారం జరగనున్న ఏకలవ్య జయంతిని విజయవంతం చేయాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.శ్రీనునాయక్ కోరారు.

## న్యూస్‌రీల్

### నేడు సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు బుధవారం తాగునీటి అవసరాల నిమిత్తం ఉదయం 10గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓఅండ్ఎం ఈఈ శ్రీహరి మంగళవారం తెలిపారు. కుడికాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఈ నీటి విడుదల కొనసాగుతుందన్నారు. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ ఆదేశాల మేరకు మొత్తం 4.5టీఎంసీల నీరు రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 9 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు.

### రేపటి నుంచి 'టీచ్ టూల్' తరగతులు

డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు



నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని ఉపాధ్యాయులకు ఈనెల 18వతేదీ నుంచి 27 వరకు తొమ్మిది రోజుల పాటు టీచ్ టూల్ మూడవ విడత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శిక్షణ తరగతుల ఏర్పాట్లపై మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో మాస్టర్ ట్రైనర్స్‌తో సమావేశం నిర్వహించారు. డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల కేంద్రాలలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 411 మంది ఉపాధ్యాయులకు 21 మంది మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారని వివరించారు. నాలుగు కేంద్రాల కో-ఆర్డినేటర్లుగా నియమితులైన మండల విద్యాశాఖాధికారులు శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజయ్యే ఉపాధ్యాయులకు అల్పాహారం, భోజన వసతితో పాటు మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ ఎస్.నాగేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

### రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనదల్చిన క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, తల్లిదండ్రుల సమ్మతి పత్రం వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9701052588 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

### బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య పీజీ పరీక్షలు వాయిదా

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 30 నుంచి జరగాల్సిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య పీజీ పరీక్షలు వాయిదా పడినట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ స్టడీ సెంటర్ సమన్వయకర్త పి.గోపీచంద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ద్వితీయ పరీక్షలు ఆగస్టు 20 నుంచి 25 వరకు, పీజీ ప్రథమ సంవత్సర పరీక్షలు సెప్టెంబర్ 20 నుంచి 24 వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష ఫీజు ఎటువంటి అపరాధ రుసుం ఈనెల 22లోపు చెల్లించాలని సూచించారు. రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 29, రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఆగస్టు 3వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. వర్సిటీ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏపీ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 503.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 813.10 అడుగుల వద్ద ఉంది.

# సాగు సాయమేది బాబూ!

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అందని సాయం
- ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తామని హామీ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
- నేటివరకు పంటరుణాలను మంజూరుచేయని ప్రభుత్వం
- గడిచిన ఐదేళ్లల్లో జిల్లాలోని రైతులకు రూ. 3844.26 కోట్లు అందించిన జగన్ సర్కార్
- సాయం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు
- పథకం అమలుపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పిన్నిబోయిన నాగేశ్వరరావు. బాపట్ల మండలం కొత్తమద్దిబోయినవారిపాలెం. రెండు ఎకరాల పొలం ఉంది. మరో 1.50 ఎకరాలు కౌలుకు చేస్తున్నాడు. ఎత్తిపోతల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాడు. ఖరీఫ్ ప్రారంభంలో దుక్కులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం పెట్టుబడి అవసరం ఉంటుంది.' ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం నరేంద్రమోదీ వేసిన రూ.2 వేలు మా అకౌంట్‌లో జమ అయినట్లు రైతు చెబుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం వేస్తానని చెప్పిన డబ్బులు రూపాయి కూడా రాలేదు. సచివాలయంకు వెళ్లి అడిగితే మాకేం తెలుసు అంటున్నారని వాపోయాడు.



దుక్కి దున్నుతున్న రైతు

బాపట్లటౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు పడుతుండడంతో నారుమళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పుడే రైతులకు పెట్టుబడి అవసరం ఉంటుంది. కానీ ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఇప్పటి వరకు రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్పు చేసిందే తప్పా... దానిని అమలు చేసే దిశగా అడుగులు వేయలేదు. దీంతో వ్యవసాయ పనులు ప్రారంభమై నెలరోజులు గడవడంతో అన్నదాతలు సాయంకోసం ఎదురు చూస్తున్నారు.

**రైతు సాయం ఊసేలేదు..**

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరి పంటలు సాగుచేసే రైతులు వెద పద్ధతిలో విత్తనాలు చల్లుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నారుమళ్లు పోశారు. మెట్టప్రాంతాల్లోని రైతులు పత్తి, మిరప, వేరుశనగ, శనగ పంటలు 20 రోజుల క్రితమే ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదికలు బ్యాంకులకు ఆలస్యంగా చేరడంతో పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా, కొత్త పంట రుణాలను పంపిణీ చేయలేదు. దీంతో రైతులకు పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంత్రి మండలి సమావేశం కూడా నిర్వహించారు. వాటిల్లో కూడా రైతులకు సంబంధించిన సుఖీభవ పథకంపై చర్చ జరగలేదు.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిందిలా..**

రైతుల అభ్యున్నతికోసం వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా ఏడాదికి రైతుకు రూ.13,500 చొప్పున ఐదేళ్లల్లో రూ.67,500 అందించారు. ఈ విధంగా ప్రకటించిన నగదును రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగా మేలో రూ.7,500, ఖరీఫ్ కోతలు, రబీలో సాగుచేసే రైతులకు అవరాల కొనుగోలు నిమిత్తం ఉపయోగపడే విధంగా అక్టోబర్‌లో రూ.4 వేలు, రైతుల పండుగగా పేరుగాంచిన సంక్రాంతి పండుగను రైతులు కుటుంబసమేతంగా జరుపుకునేందుకు వీలుగా జనవరి నెలలో రూ.2 వేల చొప్పున అందజేశారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా భరోసా కల్పించారు.

### ఐదేళ్లల్లో రూ.3844.26 కోట్లు అందజేత..

జగనన్న ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఖాతాల్లో నేరుగా నగదు జమచేయటం జరిగింది. రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి పథకాలతో ఏకంగా గడిచిన ఐదేళ్లల్లో రూ.3844.26 కోట్లును అందజేశారు. వాటిల్లో యంత్రసేవా పథకం ద్వారా 402 సీహెచ్‌సీఎస్ గ్రూపులకు గానూ 266 యంత్రాలను రూ.12.38 కోట్లతో పంపిణీ చేశారు. సున్నా వడ్డీ పథకం రూపంలో 1,26,869 మంది రైతులకు గానూ రూ. 24.90 కోట్లు పంపిణీ చేశారు.

**ఇన్‌పుట్ సబ్సిడీ...**

| నియోజకవర్గం | నష్టపోయిన రైతులు | దెబ్బతిన్న పొలాలు (హెక్టార్లు) | నగదు (రూ.కోట్లల్లో) |
|---|---|---|---|
| అద్దంకి | 5289 | 3483 | రూ. 4.38 |
| బాపట్ల | 17795 | 12445 | రూ.20.57 |
| చీరాల | 23 | 15 | రూ. 0.2 |
| పర్చూరు | 11855 | 10147 | రూ.12.24 |
| రేపల్లె | 44135 | 24554 | రూ.40.27 |
| వేమూరు | 35522 | 24676 | రూ.40.09 |
| మొత్తం | 1,14,619 | 75319 | రూ.117.56 |

**రైతు భరోసా....**

| నియోజకవర్గం | రైతులు | నగదు పంపిణీ (రూ.కోట్లల్లో) |
|---|---|---|
| అద్దంకి | 47119 | రూ.871.93 |
| చీరాల | 6535 | రూ.121.20 |
| పర్చూరు | 43610 | రూ.816.13 |
| బాపట్ల | 21947 | రూ.399.58 |
| వేమూరు | 38025 | రూ.681.44 |
| రేపల్లె | 34801 | రూ.624.95 |
| మొత్తం | 192037 | రూ.3515.24 |

**క్రాప్ ఇన్సూరెన్స్...**

| నియోజకవర్గం | రైతులు | నగదుచెల్లింపు (రూ.కోట్లు) |
|---|---|---|
| అద్దంకి | 12,400 | రూ. 57.03 |
| చీరాల | 297 | రూ. 0.26 |
| పర్చూరు | 12,719 | రూ.29.49 |
| బాపట్ల | 14,702 | రూ.16.40 |
| వేమూరు | 29,027 | రూ.38.58 |
| రేపల్లె | 22,975 | రూ.32.38 |
| మొత్తం | 92,119 | రూ.174.18 |

### హామీలను తక్షణమే అమలు చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. పేద, మధ్యతరగతి రైతులు కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మారు. రైతుల అవసరాల దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇస్తానని చెప్పిన రూ.20 వేలు అందజేస్తే బాగుంటుంది. అసలు ఈ పథకం ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు. ఎప్పుడెప్పుడు ఎంత చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తారో కూడా రైతులకు చెప్పాలి.

– యార్రాకుల సుబ్బారావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు

### అన్నదాత సుఖీభవపై స్పష్టమైన ఆదేశాలు రాలేదు



రాష్ట్ర ప్రభుత్వం రైతులకోసం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఇంత వరకు స్పష్టమైన ఆదేశాలు రాలేదు. పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలియాల్సి ఉంది. రైతులకు మూడు దఫాలుగా నగదు అందించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆదేశాలు వెలువడిన వెంటనే రైతులకు సమాచారాన్ని అందజేస్తాం.

– వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖాధికారి

## కష్టాలను సునాయాసంగా అధిగమించాం

ఎస్పీ వకుల్‌జిందాల్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ సిబ్బంది అందించిన సహకారం ఎల్లప్పుడూ మరువలేనని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్పీ వకుల్ జిందాల్‌కు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం వీడ్కోలు పలికారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో 27 నెలలపాటు పనిచేశానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో, క్లిష్టమైన బందోబస్తు విధులు నిర్వహించడంలో అందరం కలిసికట్టుగా పనిచేసినందువల్లే ఈ విజయవంతమైన ప్రయాణం సాధ్యమైందన్నారు. దీనికి హోంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ వరకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. తొలుత పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన మౌలుద్దీన్ నుంచి గౌరవవందనం స్వీకరించి, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పరేడ్ పరిశీలన చేశారు. ఘనంగా సత్కరించారు. అనంతరం సిబ్బంది నుంచి ఆత్మీయ వీడ్కోలు తీసుకున్నారు. అనంతరం పోలీస్ అధికారులు ఎస్పీను తమ భుజాలపై ఎత్తుకొని పోలీసు కవాతు వాహనంలో ఎక్కించి పరేడ్ గ్రౌండ్ నుంచి పోలీసులు వాహనాన్ని జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ కలిసి పూలతో అలంకరించిన తాళ్లతో లాగి క్యాంపు ఆఫీస్ వరకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పీ.విఠలేశ్వర్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, బాపట్ల, చీరాల డీఎస్పీలు సిహెచ్.మురళీకృష్ణ, పి.జగదీష్ నాయక్ పాల్గొన్నారు.

## బ్యాంకర్లు అధిక రుణాలు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రాధాన్య రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన వార్షిక ప్రణాళికను ఆమోదించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన జిల్లాలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యంతో రుణ సదుపాయం కల్పించాలని కోరారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,443.60 కోట్లు రుణం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అందులో ప్రాధాన్య రంగాలకు రూ.11,719 కోట్ల రుణాలు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయానికి రూ.10,053 కోట్ల రుణాలు ఇవ్వాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు రూ.1,153.33 కోట్లు కేటాయించాలని చెప్పారు. విద్యా రుణాలు, గృహ నిర్మాణాలు, విద్యుద్దీకరణ, సామాజిక అవసరాలు తదితర రంగాలకు రూ.512 కోట్లు రుణాలు ఇవ్వాలని కోరారు. వార్షిక ప్రణాళికను తక్షణమే అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. బాపట్ల జిల్లా ఆవిర్భావం నుంచి రూ.20,272 కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. అందులో వ్యవసాయ రంగానికి రూ.12,792 కోట్లు కాగా, పరిశ్రమలకు రూ.1,611 కోట్లు, ఇతర ప్రాధాన్య రంగాలకు రూ.921 కోట్లు, ప్రాధాన్య లేని రంగాలకు రూ.4,947కోట్లు రుణాలు ఇచ్చినట్లు వివరించారు. బాపట్ల జిల్లాలో 28 బ్యాంకులు పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రధానంగా సిసిఆర్ సి కార్డులు జారీచేసి రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఆర్.బి.ఐ. నిబంధనల మేరకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.10,743 కోట్లు రుణం ఇవ్వాలని లక్ష్యం కాగా రూ.12,792 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ అన్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ బ్యాంక్ అధికారులంతా సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల సామాజిక అభివృద్ధికి రుణ సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, లీడ్ బ్యాంకు కన్వీనర్ మాధురి, ఎల్ డి ఎం శివకృష్ణ, నాబార్డు డీడీఎం రవికుమార్, ఆర్‌బీఐ అధికారి నవీన్ పాల్గొన్నారు.

## పోస్టాఫీసులో ఖాతాదారుల సొమ్ము స్వాహా

- రూ.కోటికిపైగా దుర్వినియోగం చేసిన పోస్టల్ అధికారి
- నగరం మండలం సిరిపూడిలో ఘటన
- లబోదిబో మంటున్న బాధితులు




సిరిపూడి పోస్ట్ ఆఫీసు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఖాతాదారులు

రేపల్లె రూరల్/నగరం: ఖాతాదారుల సొమ్మును స్వాహా చేసిన పోస్టుమాస్టర్ బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరం మండలం సిరిపూడి పోస్టాఫీసులో పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తించే గోపీమనోజ్ ఖాతాదారులను నమ్మించి మోసం చేసినట్లు సమాచారం. ఖాతాదారులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని పోస్టాఫీసులో 700లకుపైగా ఖాతాలున్నాయి. పలువురు ఖాతాదారులు తాము దాచుకున్న నగదుపై రుణాన్ని ఇప్పించాలని పోస్టుమాస్టర్‌ను గతంలో కలసి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఇవ్వటం కుదరదని, వారం రోజులు ఆగి రమ్మని చెప్పి పంపించి వేశారు. నెలరోజులు గడిచినా రుణాన్ని ఇవ్వక పోగా సాకులు చెబుతుండటంతో అనుమానం వచ్చిన ఖాతాదారులు పోస్టల్ అధికారిని నిలదీశారు. మరుసటి రోజు నుంచి పోస్టుమాస్టర్, పోస్టాఫీసుకు రాకపోవటంతో ఖాతాదారులు పిట్టలవానిపాలెంలోని హెడ్ పోస్టాఫీసులో సంప్రదించి నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోస్టల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిరిపూడి పోస్టాఫీసులో జరిగిన అవకతవకలపై పలువురు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలోని పాగోలు శ్రీనివాసరావు రూ.5 లక్షలు, పాగోలు సీతారామయ్య రూ.2 లక్షలుపైగా పొదుపు ఖాతా ద్వారా భద్రపరుచుకోగా వారి ఖాతాలలో ఎటువంటి నగదు లేవని విచారణలో అధికారులు తేల్చడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. పోస్టాఫీసులో ఉన్న 700 ఖాతాలలో గోల్‌మాల్ జరిగినట్లు మొత్తంగా రూ.కోటికిపైగా ఖాతాదారుల సొమ్మును ఆ అధికారి స్వాహా చేసినట్లు విచారణలో నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

**విచారణ చేపట్టాం: నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్**

సిరిపూడి సబ్‌బ్రాంచి పోస్టాఫీసులో నగదు గోల్‌మాల్ అయినట్లు ఫిర్యాదులు అందటంతో విచారణ చేపట్టాం. బ్రాంచిలో ఎన్ని ఖాతాలు ఉన్నాయి, ఎంత మేర నగదు అపహరణకు గురైందన్న అంశాలపై విచారణ చేస్తున్నాం. విచారణ పూర్తిచేసిన అనంతరం అవకతవకలు రుజువైతే సంబంధిత పోస్టుమాస్టర్‌పై చర్యలు తీసుకుంటాం.


### ఖాతాలో నగదు మాయం



2018 నుంచి పొదుపు ఖాతాలోరా నగదు దాచుకుంటున్నా. ప్రతి నెల ఇంట్లో అవసరాలు తీరిన తరువాత మిగిలిన సొమ్మును పోస్టాఫీసులో జమ చేస్తున్నా. ఇప్పటి వరకు రూ.90 వేలకుపైగా కట్టాను. అయితే 2021 వరకు మాత్రమే నగదు చెల్లించినట్లుగా ఉందని, నా అకౌంట్‌లో రూ.45 వేలు మాత్రమే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఏమి చేయాలో తోచటంలేదు.

–యెనుమల శ్రీనివాసరావు, సిరిపూడి

### ఖాతా వివరాలు చెప్పడం లేదు



పొదుపు ఖాతా ద్వారా ఇప్పటి వరకు రూ.5 లక్షలకుపైగా పోస్టాఫీసులో దాచుకున్నా. నా ఖాతాలో ఎంత ఉన్నాయో కూడా అధికారులు చెప్పటం లేదు. గత పది సంవత్సరాలుగా పోస్టల్ అధికారి గోపి మనోజ్ మా గ్రామంలో విధులు నిర్వర్తిస్తుండటంతో నమ్మకంగా సొమ్మును నెలనెల నా ఖాతాలో జమ చేయాలని అతడికి ఇచ్చాను. అతను ఇంత మోసం చేస్తాడని అనుకోలేదు. కూలీ నాలీ చేసుకుని దాచుకున్న సొమ్ము నాకు ఇప్పించి అధికారులు న్యాయం చేయాలి.

–కొనకాల వెంకటేశ్వరమ్మ, సిరిపూడి

## యార్డులో 36,277 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,622 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,277 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,800 నుంచి రూ.18,000 వరకు లభించింది.

## క్లుప్తంగా

### గుంటూరు జిల్లాలో వర్షపాతం 11.1 మిల్లీమీటర్లు

**అత్యధికంగా మేడికొండూరులో 20.2 మి.మీ.**

**కొరిటిపాడు(గుంటూరు):** గుంటూరు జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 11.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మేడికొండూరు మండలంలో 20.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 1.6 మి.మీ. వర్షం కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ మండలంలో 18.4 మి.మీ., గుంటూరు తూర్పు 16.2, కొల్లిపర 15.2, గుంటూరు పశ్చిమ 15, చేబ్రోలు 14.8, తుళ్లూరు 14.4, మంగళగిరి 13, ఫిరంగిపురం 11.2, పెదనందిపాడు 10.8, ప్రత్తిపాడు 9.4, వట్టిచెరుకూరు 8.8, దుగ్గిరాల 8.6, పొన్నూరు 7.8, తాడేపల్లి 6.4, తెనాలి 5.2, కాకుమాను మండలంలో 3.6 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

### 20న దివ్యాంగులకు మెగా జాబ్‌మేళా

**గుంటూరు ఎడ్యుకేషన్:** జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న దివ్యాంగుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోరంట్లలోని హోసన్నా మందిర్ ఎదుట సమర్థనం సంస్థలో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత హాజరు కావాలని సూచించారు. నాలుగు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో అభ్యర్థుల అర్హతలు ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని, విద్యార్హతల రెజ్యూమ్, ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హతల ధ్రువపత్రాలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### కారు ఢీకొని యువకుడు మృతి



**మేడికొండూరు:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మేడికొండూరు మండలం పేరేచర్ల యూనివర్సల్ కాలేజీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం పొందుగల గ్రామానికి చెందిన ఆరెకట్ల శివనాగేశ్వరరావు(26) ఉద్యోగ అవకాశాల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మార్కాపురం బయలుదేరాడు. మార్గంమధ్యలో పేరేచర్ల యూనివర్సల్ కళాశాల సమీపంలో అతివేగంగా నరసరావుపేట నుంచి పేరేచర్ల వైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. సంఘటనా స్థలంలోనే శివనాగేశ్వరరావు మృతి చెందాడు. సంఘటన గురించి మృతుని బంధువులకు తెలిపిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి మేడికొండూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గంజాయికి.. యువత చిత్తు

'గత నెల 22న తెల్లవారుజామున ఈపూరుపాలేనికి చెందిన సుచరిత(22) బహిర్భూమికి వెళ్లింది. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి లైంగిక దాడికి పాల్పడ్డారు'. ఇటువంటి ఘటనలు చీరాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అనేకం నెలరోజుల్లో చోటుచేసుకున్నాయి..

ఒక షాపులో ఓ యువకుడు కూర్చున్నాడు. అక్కడకు వచ్చిన మరో యువకుడు నా వైపు ఎందుకు చూస్తున్నావంటూ గొడవకు దిగాడు. వెంటనే అతడి స్నేహితులు ఒక్కసారిగా వచ్చి దాడికి పాల్పడ్డారు. వీరంతా గంజాయి మత్తులో ఉండడంతో యువకుడిని చితకబాది వెళ్లిపోయారు. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. వీటికి ప్రధాన కారణం యథేచ్ఛగా గంజాయి లభించడమేనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- వైజాగ్ టూ బాపట్ల
- చీరాల, రేపల్లెలో పట్టుబడిన గంజాయి
- నామమాత్రంగా చర్యలు



ఇటీవల చీరాలలో పట్టుబడ్డ గంజాయితో పోలీసులు(ఫైల్)

**చీరాల:** చీరాల పట్టణం వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా పట్టణాల్లో ఒకటి. విద్యా రంగంలోనూ గుర్తింపు ఉంది. పట్టణానికి ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చి వెళ్తుంటారు. కోట్లాది రూపాయలు వ్యాపారం రూపేణా చేతులుమారుతుంటాయి. బాపట్ల జిల్లా అంటే ఉన్నత చదువులకు కేరాఫ్‌గా ఉండేది. ప్రస్తుతం గంజాయికి అడ్డాగా మారింది. చీరాలతో పాటు జిల్లాలోని పలు పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. యువత బలహీనతలను సొమ్ము చేసుకునేందుకు కొందరు చెడు మార్గాన్ని ఎంచుకున్నారు. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయాలు చేపట్టారు.

### యువతే లక్ష్యంగా...

యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ కళాశాలల వద్దే విక్రయిస్తున్నారు. చదువు మధ్యలో మానేసి చెడు అలవాట్లకు బానిసలైన వారిని ఎంచుకుని గంజాయి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. స్వయంగా హోం శాఖ మంత్రి గంజాయిని రాష్ట్రంలో లేకుండా చేస్తామని చెప్పిన కొద్దిరోజులకే చీరాల, రేపల్లెలో గంజాయి విక్రయిస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

### ఎక్కడెక్కడే పట్టుబడ్డారంటే..

ఇటీవల రేపల్లె మండలం పెనుమూడి కృష్ణానది ఒడ్డున గంజాయి విక్రయిస్తున్న పది మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి ఆరున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్ నుంచి జిల్లాలకు సరఫరా చేస్తున్న అసలు సూత్రధారులు మాత్రం పోలీసులకు చిక్కడం లేదు.

వైజాగ్ నుంచి కొన్ని ముఠాలు రైళ్లు, బస్సులు, సొంత వాహనాలు ద్వారా విజయవాడ, బాపట్ల, రేపల్లె, వెదుళ్లపల్లి, చీరాలకు భారీగా తరలిస్తున్నారు. అక్కడ నుంచి చిరువ్యాపారుల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. కళాశాలల వద్ద అమ్మేందుకు గాను ప్రత్యేకంగా విద్యార్థులను నియమించుకున్నారు. వారికి డబ్బు ఆశ చూపి కళాశాలను గంజాయి కేంద్రాలుగా మార్చేశారు. గంజాయికి అలవాటు పడిన విద్యార్థులు అల్లరి, చిల్లరగా తిరుగుతూ జులాయిలుగా మారిపోతున్నారు. ఉన్నత చదువులు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. గంజాయి మత్తులో ఘర్షణలకు దిగుతున్నారు.

విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న ఘటనలు చీరాల ప్రాంతంలో అనేకం ఉన్నాయి. ఇదే మత్తులో వాడరేవు, రామాపురం, సూర్యలంక బీచ్‌ల వద్ద లోతుకు వెళ్లి ప్రాణాలు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం గంజాయిని అరికడతామని పదేపదే చెప్పినా ఆచరణలో కనీస చర్యలు తీసుకోవడం లేదు.

### గతంలో ఉక్కుపాదం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు సెబ్‌ను ఏర్పాటు చేసింది. సెబ్, పోలీసులు స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా ఉంచి ఎక్కడికక్కడ వారిని అరికట్టేవారు. అయితే గత కొద్ది రోజులుగా మళ్లీ గంజాయి రవాణా జోరందుకుంటోంది. దీనిపై పటిష్ట నిఘా లేకపోవడం సరైన సమాచారం అందించే నాథుడు లేకపోవడం గమనార్హం.

### గంజాయిని పూర్తిగా అరికడతాం

గంజాయి స్మగ్లర్లపై ప్రత్యేక నిఘాపెట్టాం. ఇప్పటికే పలువురి అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నాం. విద్యార్థులు కళాశాల యజమాన్యాలు అవగాహన సదస్సు నిర్వహించాలి. ముఖ్యంగా తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. అప్పుడే విద్యార్థులు మత్తు పదార్థాలు దూరంగా ఉంటారు.

– సోమశేఖర్, సీఐ, టూటౌన్

### పటిష్ట స్థితిలో వైఎస్సార్ కడప జట్టు

**నరసరావుపేట ఈస్ట్:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన వైఎస్సార్ కడప- చిత్తూరు జట్ల మ్యాచ్‌లో కడప జట్టు పటిష్ట స్థితికి చేరుకొంది. వర్షం కారణంగా తొలిరోజు ఆట రద్దు కాగా రెండవరోజు పలు మార్లు అంతరాయం చోటు చేసుకొంది. ఓవర్‌నైట్ స్కోర్ 35 పరుగులతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కడప జట్టు 255 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జి.గైబు 69, జి.వి.సాయిసాకేత్ 49 పరుగులు సాధించారు. చిత్తూరు బౌలర్ సోహన్‌రెడ్డి 23.2 ఓవర్లలో 56 పరుగులు ఇచ్చి 6 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మంగళవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు సాధించింది. వర్షం కారణంగా తొలిరోజు ఆట రద్దు కావటంతో బుధవారం కూడా మ్యాచ్ కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

# కారుణ్యమూర్తి కార్మెల్‌మాత


పూజల్లో పాల్గొన్న భక్తులు


కార్మెల్‌మాత స్వరూపంతో ప్రదక్షిణ చేస్తున్న గురువులు

**ఫిరంగిపురం:** కారుణ్యమూర్తి కార్మెల్‌మాత అని పలువురు గురువులు చెప్పారు. కార్మెల్ కొండపై జరుగుతున్న ఉత్సవాలు మంగళవారం మూడోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సమష్టి దివ్యపూజాబలి కార్యక్రమంలో ప్రధాన యాజకుడు, నూతన అభిషిక్త గురువు కె.శౌరినిఖిల్ తేజ, గురువులు ప్రవీణ్‌కుమార్, చొప్పరకిషోర్‌బాబు పాల్గొన్నారు. కార్మెల్‌మాత అవతరణ విశేషాలను వివరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తేరుపై కార్మెల్‌మాత స్వరూపాన్ని ఉంచి గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. అనంతరం కొండపై తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి , కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడురోజులుగా ఏడుగురు సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాల ఏసుదేవాలయం సమీపంలోని పునీత అంథోనివారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకుడు మున్నంగి జోజప్ప ప్రసాదాలు అందజేశారు.

## తప్పిన ప్రమాదం

**మేదరమెట్ల:** డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన కారు డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీ కొంది. ఈ ఘటన కొరిశపాడు మండల పరిధిలోని పి.గుడిపాడు జాతీయహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు పి.గుడిపాడు సమీపానికి రాగానే డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీ కొంది. కారులో ముగ్గురు ఉన్నారు. అయితే ఎవరికీ గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

**డాక్టరు కొల్లా**


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు డాక్టరు కొల్లా

**బాపట్ల:** గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టరు కొల్లా రాజమోహనరావు కోరారు. బాపట్ల మండలంలోని చెరువు జమ్ములపాలెంలోని రామాలయంలో మంగళవారం రైతుల సమావేశం నిర్వహించారు. డాక్టరు కొల్లా మాట్లాడుతూ గుంటూరు చానల్ కోసం ఎంతో కాలంగా పెదనందిపాడు, పర్చూరు ప్రాంత రైతులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మాట్లాడుతూ జమ్ములపాలెం అధ్యక్షులు కాపు వెంకట కమలాకరరావు, విజయకుమార్, మానం విజేత, వైపీ చౌదరి, కామేపల్లి కృషిబాబు, జిల్లెళ్లమూడి సర్పంచి గండికోట సుబ్బయ్య, పువ్వాడ బసంత్‌కుమార్, పంగులూరి శ్రీనివాసరావు ఉన్నారు.

## కేవీకే గోల్డెన్ జూబ్లీ వేడుకలు ప్రారంభం

**గుంటూరు రూరల్:** వ్యవసాయ విస్తరణ, పరిశోధన, విద్య రంగాలలో 50 ఏళ్లుగా కృషి విజ్ఞాన కేంద్రాలు అందించిన సేవలు నిరుపమానమని లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. యుగంధర్‌కుమార్ కొనియాడారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతులను విప్లవాత్మకంగా మార్చటంలో, గ్రామీణ జీవనోపాధిని మెరుగు పరచటంలో, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో కేవీకే సాధించిన విజయాలను వివరించారు.

# పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

**కలెక్టర్ జె.వెంకట మురళి**


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

**బాపట్ల:** పరిశ్రమలలో ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన ఫ్యాక్టరీలను తనిఖీలు చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలో అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరగడంతో ప్రమాదాలపై ప్రభుత్వం అప్రమత్తమైందని చెప్పారు. ఫ్యాక్టరీల భద్రతపై తనిఖీ చేయాలని జీఓ నంబర్ 79ని విడుదల చేసినట్లు వివరించారు. ఆ మేరకు జిల్లాలో కాటన్, ఆక్వా, మిర్చి ప్రాసెసింగ్ చేసే తదితరమైన ఫ్యాక్టరీలలో అమోనియం వినియోగించే ఫ్యాక్టరీలు19 ఉన్నట్లు గుర్తించామన్నారు. 15 రోజుల్లో తనిఖీలు చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు. ప్రభుత్వ జీవోను అనుసరించి జిల్లాలోని ఫ్యాక్టరీలన్నింటిని ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, పరిశ్రమల శాఖ జీఎం వై.కృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి జి.రాఘవరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ చీఫ్ ఫ్యాక్టరీస్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బ్రాయిలర్ తనిఖీ అధికారి శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఎలక్ట్రికల్ డీఈ గీత, కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకట శివ ప్రసాద్ పాల్గొన్నారు.

**దినసరి కార్మికుల వేతనాలు పెంపు**

దినసరి వేతనాల కింద పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచుతూ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో దినసరి వేతనాల పద్ధతిలో పనిచేస్తున్న వారికి సకాలంలో నగదు చెల్లింపులు చేయాలని కోరారు. తక్షణమే ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ఆ మేరకు ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకట శివ ప్రసాద్, సహాయ కార్మిక అధికారి సాయి జ్యోతి, మత్స్య శాఖ జేడీ పి.సురేష్, జల వనరులశాఖ ఈఈ డి.మురళీకృష్ణ, డ్రైనేజీ విభాగం ఈఈ వెంకటరత్నం, శివరామకృష్ణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

# బాపట్లలో పనిచేసిన రోజులు మరువలేను

- నూతన జిల్లా కావడంతో వనరులు సమకూర్చుకున్నాం
- చిరస్థాయిగా గుర్తుండిపోయేలా వసతులు కల్పించాం
- వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్‌జిందాల్


ఎస్పీ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

**బాపట్లటౌన్:** బాపట్లలో పనిచేసిన రోజులు ఎప్పటికీ మరువలేనని ఎస్పీ వకుల్‌జిందాల్ పేర్కొన్నారు. విజయనగరం ఎస్పీగా బదిలీపై వెళ్తున్న వకుల్‌జిందాల్ దంపతులను సోమవారం రాత్రి ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ బాపట్ల నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత అన్ని వసతులు కల్పించే అవకాశం దక్కిందన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఉండాల్సిన కనీస వసతులు లేకపోయినప్పటికీ అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పక్కనే ఉండటంతో కొన్ని వసతులు అక్కడి నుంచి సమకూర్చుకున్నామని చెప్పారు.

విజయనగరం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ మాట్లాడుతూ ఎస్పీ వకుల్ జిందాల్ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ఆలోచిస్తారని, ఒక సమస్య ఎదురైనప్పుడు దాని పర్యవసానాలు ఏ విధంగా ఉంటాయి, ఆ సమస్యను అధిగమించడానికి ఏ విధంగా వ్యవహరించాలి అనే విషయాలను క్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారన్నారు. శాంతి భద్రతల సమస్యలను సునాయాసంగా పరిష్కరించగలరన్నారు. వృత్తిపరమైన జీవితానికి, కుటుంబానికి సమాన ప్రాధాన్యత ఇస్తారన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో సమర్థవంతంగా శాంతిభద్రతలను పరిరక్షించి జిల్లా ప్రజల మన్ననలు పొందారన్నారు. బాపట్ల డీఎస్పీ సిహెచ్.మురళీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ పి.జగదీష్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిపై టీడీపీ నేతల కన్ను


బాపట్ల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


మార్టూరులోని వివాదాస్పద ప్రభుత్వ భూమి

**కలెక్టర్‌కు ప్రజాసంఘాల ఫిర్యాదు**

**మార్టూరు:** తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రం మార్టూరు జాతీయ రహదారి పక్కన పోలీసుస్టేషన్, కూరగాయల మార్కెట్ మధ్య ఉన్న సర్వే నంబర్ 640/ఏలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని టీడీపీ పెద్దలు కబ్జా యత్నం చేస్తున్నారని.. కాపాడాలంటూ బాపట్ల జిల్లా కలెక్టర్ జే వెంకట మురళికి మార్టూరుకు చెందిన ప్రజాసంఘాల నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ భూమిని టీడీపీ నాయకుడు తొండెపు ఆదినారాయణ తన భార్య తొండపు ఆదిలక్ష్మి పేరుతో నకిలీ పట్టా సృష్టించి కబ్జా చేయడానికి గత దశాబ్ద కాలంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీనికి స్థానిక రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కోట్లాది రూపాయల విలువ పలుకుతోందని కబ్జా ప్రయత్నాలను అధికారులు అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అర్జీని పరిశీలించిన కలెక్టర్, విచారణకు ఆదేశించినట్లు ప్రజాసంఘాల నాయకుడు షేక్ మహమ్మద్‌బాషా తెలిపారు.

**రికార్డుల్లో చుక్కల భూములుగా ఉంది..**

ఈ విషయమై మార్టూరు తహసీల్దార్ కే సంధ్యశ్రీని మంగళవారం వివరణ కోరగా 640/ఏ సర్వే నంబరు భూమి ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల దాఖల చుక్కల భూమిగా నమోదైందని, తొండెపు ఆదిలక్ష్మి అనే మహిళ తమకు పెట్టిన అర్జీలోని పట్టా లోపభూయిష్టంగా ఉందని, డీకే రిజిస్టర్‌లో నమోదు కాలేదని చెప్పారు. రెవెన్యూ అధికారులు ఎవరూ కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేయడానికి ఎవరికీ సహకరించటం లేదని స్పష్టం చేశారు.

## గుంటూరు రేంజ్‌లో పది మంది సీఐలు బదిలీ

**నగరంపాలెం:** గుంటూరు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

| సీఐ పేరు | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|
| ఎం.విజయచరణ్ | సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, పల్నాడు | నరసరావుపేట 1 టౌన్ పీఎస్ |
| సిరిగిరి సాంబశివరావు | వినుకొండ టౌన్ పీఎస్ | నరసరావుపేట 2 టౌన్ పీఎస్, పల్నాడు |
| యు.శోభన్‌బాబు | డీఎస్‌బీ-2, పల్నాడు జిల్లా | వినుకొండ టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా |
| పసుపులేటి రామకృష్ణ | వేమూరు సర్కిల్, బాపట్ల | నరసరావుపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా |
| బలగాని ప్రభాకర్ | తుళ్లూరు ట్రాఫిక్-2, గుంటూరు | వినుకొండ రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా |
| బి.సుబ్బనాయుడు | ఎస్సీ, ఎస్టీ సెల్, పల్నాడు | చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా |
| కె.వెంకటప్రసాద్ | డీఎస్‌బీ-3, గుంటూరు | అచ్చంపేట యూపీఎస్, పల్నాడు జిల్లా |
| ప్రత్తిపాటి సురేష్ | రేంజ్ వీఆర్, గుంటూరు | పెదకూరపాడు సర్కిల్, పల్నాడు జిల్లా |
| ఎం.సుబ్రమణ్యం | రాపూర్ సర్కిల్, నెల్లూరు | సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా |
| పోలూరి శ్రీనివాస్ | సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా | సత్తెనపల్లి రూరల్ పీఎస్, పల్నాడు జిల్లా |

## డయేరియాతో మరో వ్యక్తి మృతి

**పిడుగురాళ్ల:** డయేరియాతో మరో వ్యక్తి మృతి చెందాడు. పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన ఓర్సు ఆంజనేయులు(60) వారం రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో పట్టణంలోని మారుతి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చేరాడు. డయేరియా అదుపు కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ రెండు రోజులు వైద్య చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆంజనేయులు మృతితో డయేరియా మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రభుత్వ వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు పట్టణంలో డయేరియా అదుపులో ఉందని చెప్పడం మాటలకే పరిమితం అయిందని, చేతల్లో మాత్రం సాధ్యం కావడంలేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ వైద్యాధికారులు పూర్తిస్థాయిలో మెరుగైన పారిశుద్ధ్య పనులు, వైద్యసేవలు చేపట్టకపోతే మరణాలు పెరిగే అవకాశం ఉందని, తక్షణమే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.